www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 17 డిసెంబర్ 2022
5
వైఎస్ఆర్

పెద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తున్న హీరో మంచు మనోజ్

త్వరలో కొత్త జీవితం

పెద్దదర్గాలో హీరో మంచు మనోజ్ ప్రార్థనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

త్వరలోనే కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నానని హీరో మంచుమనోజ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో పెద్ద దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా సంప్రదాయం ప్రకారం మంచు మనోజ్ తలకు పాగా చుట్టి దర్గా ముజావర్లు ఘనంగా స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. దర్గాకు రావడం చాలా సంతోషంగా ఉందని, ఎప్పటి నుంచో ఇక్కడికి రావాలని అనుకుంటున్నానని చెప్పారు. త్వరలో కొత్త సినిమాలు చేయనున్నానని, మళ్లీ కుటుంబ సభ్యులతో దర్గాను సందర్శిస్తానని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

రైతులకు అండగా ప్రభుత్వం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సాగులో అధిక దిగుబడులు సాధించేలా ప్రణాళికలు అమలు చేయాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వ్యవసాయ, ఉద్యాన, నీటి వనరులు, మార్కెటింగ్, ప్రకృతి వ్యవసాయం, మత్స్యశాఖ, మార్క్ ఫెడ్ శాఖలు, ఆదర్శ రైతులు, రైతు సంఘాలతో వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 735 రెవెన్యూ గ్రామాలకు గాను 680 గ్రామాల్లో ఖరీఫ్ 2,33,575 ఎకరాల్లో, రబీలో 2,22,806 పంటల సాగుకుగాను పూర్తి స్థాయిలో 97.79 ఈ క్రాప్ కూడా పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందివ్వాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా వివిధ పథకాలను అందించడంతో నిరంతరం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రాయల సీమ హార్టికల్చర్ హబ్ అని దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహా దారుడు తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడంలో మార్కెట్ కమిటీలు మూలస్తంభాలుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, జిల్లా ఉద్యాన సలహా బోర్డ్ చైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, వ్యవసాయ కమిటీ సభ్యులు బలరాం రెడ్డి, డిసిసిబి చైర్మన్ ఝాన్సీ, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వర రావు, ఉద్యానశాఖ డిడి మైకేల్ రాజేష్, ఆత్మ పీడీ విజయకుమారి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.శారద, ఎండిఎం దుర్గా ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ అధికారులు,పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సహకార, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

డేంజర్‌జోన్‌లో ఆ ముగ్గురు!

మార్చి సమీక్ష నాటికి మెరుగుపరుచుకోండి
ప్రొద్దుటూరు ఎమ్మెల్యే 'రాచమల్లు'కు ప్రశంస
గడపగడపకూ సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ప్రజాశక్తి - కడపప్రతినిధి

గడప గడపకూ ప్రభుత్వం సమీక్షలో ముగ్గురు ఎమ్మెల్యేలకు డేంజర్‌జోన్‌లో ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన శుక్రవారం విజయవాడలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నాలుగు నెలల కిందట నిర్వహించిన సమీక్షలో డేంజర్‌జోన్, సేఫ్‌జోన్ పేర్లతో కూడిన జాబితాలను ప్రకటించారు. డేంజర్‌జోన్ జాబితాలో కొంత మంది ఉన్న విషయం తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ ఎమ్మెల్యేలు చురుకుగా పాల్గొనాలని, క్షేత్రస్థాయిలో వ్యతిరేకత కనిపిస్తోందని సర్వేలు వెల్లడిస్తున్నట్లు హెచ్చరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయే నేతలకు టికెట్లు ఇవ్వడం కదరదని తేల్చేసిన నేపథ్యంలో గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. సచివాలయం పరిధిలో వారంలో కనీసం నాలుగు రోజుల చొప్పున నెలకు 16 రోజులపాటు ఇంటింటికి వెళ్లి ప్రజలతో సంబంధాలు నెరపాలని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకోవాలని, వ్యక్తిగత సమస్యలు ఉంటే పరిష్కరించి ప్రజల మనసుల్లో గెలుచుకు రావాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలను అమలు చేయని ఎమ్మెల్యేలను తాజా సమీక్షలో సుతిమెత్తగానే హెచ్చరించినట్లు తెలిసింది. గతంలో చేసిన హెచ్చరికల నేపథ్యంలో 40 శాతం మంది ఎమ్మెల్యేల పనితీరులో మెరుగుదల కనిపించిందని, కానీ ఇప్పటికీ చాలా మంది డేంజర్‌జోన్ జాబితాలోనే ఉన్నారని, వచ్చే మార్చిలో నిర్వహించే సమీక్ష నాటికి పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించినట్లు తెలిసింది. లేనిపక్షంలో 2024 సార్వత్రిక ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఎంతో మంది తమ కోసం కష్టపడ్డారని, అటువంటి మిమ్మల్ని పోగొట్టుకోవాల్సిన దుస్థితిని తీసుకురావొద్దని, తన ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. 30 రోజుల వ్యవధిలో 12 నుంచి 16 రోజుల పాటు గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో సీరియస్‌గా పాల్గొని, తమ పనితీరును, సమర్థతను పెంచుకోవాలని సూచించినట్లు తెలిసింది. లేని పక్షంలో 2024 సార్వత్రిక ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో సర్వే ప్రకారం సమర్థత ఆధారంగా టికెట్లను కేటాయించాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సమీక్షా సమావేశంలో డేంజర్‌జోన్ జాబితాలోని పేర్లను చదివి వినిపించినట్లు సమాచారం.

మరోసారి ముగ్గురే..!

కడప, అన్నమయ్య జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కడప జిల్లాలో మైదుకూరు, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తంబళ్లపల్లి ఎమ్మెల్యేల డేంజర్‌జోన్ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమ నిర్వహణలో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు కైవసం చేసుకోవడంతో ప్రశంసించినట్లు సమాచారం. గత సమీక్ష సందర్భంగా నియోజకవర్గాల పరిధిలోని ఆయా సచివాలయాల పరిధిలో ప్రాంతాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేల్లో సార్వత్రిక ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో డేంజర్, సేఫ్‌జోన్ అనే తేడాలతో నిమిత్తం లేకుండా టెన్షన్ వాతావరణం నెలకొంది. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మోకాలికి శస్త్రచికిత్స చేసు కోవడంతో ఆయన గడప గడపకూలో పాల్గొన లేక పోయారని తెలిసింది. కొద్ది రోజులు విశ్రాంతి అనంతరం ఆయన కార్యక్రమాల్లో చురుగ్గాపాల్గొంటున్నారనే భావన సిఎంకు వచ్చినట్లు సమాచారం.

ధర్నాలో మాట్లాడుతున్న సుంకర రవి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్ చేశారు. శుక్రవారం కడప కార్పొరేషన్ ఎదుట డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కమిషనర్, కార్పొరేషన్ అధికారులు, సెక్రెటరీలు కార్మికుల్ని వేధిస్తున్నారని విమర్శించారు. నాలుగు పూటల మస్టర్లు చాలా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. తెల్లవారుజామున ఈ మంచు కాలంలో 6 గంటలకు కూడా తెల్ల వారడం లేదని, కార్మికుల్ని నాలుగు గంటలకు రావడం బాధాకరమని తెలిపారు. కమిషనర్ స్పందించి గతంలో ఉన్న సమయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్ మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు కడప నగరంలో లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర మొత్తం ఇచ్చారని, కడప నగరపాలక సంస్థ ఇవ్వకుండా మొండివైఖరి ప్రదర్శించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లాప్ డ్రైవర్స్ జీతాలు, కోవిడ్-19 కార్మికులకి ఈఎస్ఐ, పీఎఫ్, పెండింగ్‌లో ఉన్న చెప్పులు, బట్టలు, నూనెలు, కుట్టుకూలీలు, మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 23న సీఎం ప్రోగ్రాం లో విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అందాస్, రమేష్, కొండయ్య, నాగరాజు, దాసు, శివకుమార్, మహిళా కార్మికులు మున్నంగి పెంచలమ్మ, రమాదేవి, వెంకటమ్మ, దస్తగిరమ్మ, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

ఆయుధంపై పట్టుపై ముఖ్యం

కడప : ఆయుధంపై పట్టు, ఏకాగ్రత, లక్ష్యంపైన దృష్టి మంచి ఫైరర్‌కు ఉండాల్సిన ముఖ్య లక్షణాలని ఎన్‌సిసి 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ విభోర్ గుప్తా అన్నారు. కడప నగరంలోని తెలుగుగంగ కాలనీలో నిర్వహించబడుతున్న 11వ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో భాగంగా శుక్రవారం ఎన్‌సిసి కేడెట్లకు ఆయుధ శిక్షణ, ఫైరింగ్ సాధనపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ ఫైరింగ్‌లో శిక్షణ పొంది మంచి గ్రూపింగ్ సాధించిన కేడెట్లకు జాతీయస్థాయిలో కూడా పోటీలు నిర్వహిస్తామన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరుల స్తూపానికి జిల్లా మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. దేశం కోసం అమరులైన వారికి వారి కుటుంబ సభ్యులకు మంచి జరగాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఎర్రముకపల్లి వద్ద ఉన్న అమర్ జవాన్ స్తూపం కి పుష్పములతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మాజీ సైనికుల సంక్షేమార్థం కేంద్రం పలు ఆర్థిక సహాయ, సహకారాలను ప్రకటించిందని పేర్కొన్నారు. ఆర్మీ ఫ్లాగ్ డే ఫండ్ ద్వారా సైనిక సంక్షేమం కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందులో మాజీ సైనికులు, సైనిక వితంతువులు, వికలాంగులు వారి అనాధ పిల్లల కు పలు రకాల ఆర్థిక సహాయ సహకారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించి అందిస్తూ సహాయ పడుతున్నాయని చెప్పారు. అయితే అవి ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సరిపోవడం లేదని తెలిపారు. **బద్వేలు :** విజయ దివాస్ సందర్భంగా స్థానిక శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌సిసి, ఆర్మీ, నేవి, ఎయిర్ ఫోర్సు కేడెట్స్ అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. ముందుగా కళాశాల ప్రాంగణం నుంచి పోరుమామిళ్ల రోడ్డు లోని అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల పరిపాల అధికారి సాయి కృష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఆర్మీ విశ్రాంత అధికారులు పెంచలయ్య, శ్రీనివాసులు రామిరెడ్డి, చంద్రుడు మధుసూదన, కళాశాల ఆర్మీ లెఫ్టినెంట్ టి. బాల ఓబులేసు, నేవీ సబ్ లెఫ్టినెంట్ జి.సుధాకర్ రెడ్డి, ఎయిర్ వింగ్ సిటిఓ వై.వీరేంద్ర పాల్గొన్నారు. **పోరుమామిళ్లటౌన్:** విజయ్ దివస్ సందర్భంగా పోరుమామిళ్లలోని మాజీ సైనిక అమర జవాన్ మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమరులైన సైనికులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కెప్టెన్ ఎస్ఎస్ రాముడు గౌరవ అధ్యక్షులు కెప్టెన్ వెంకటయ్య, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, విశ్రాంత కెప్టెన్ బాడీ మెంబర్స్, మాజీ సైనిక సైనికులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

29,30న సిఐటియు 9వ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఐటియు 9వ జిల్లా మహాసభలు ఈనెల 29,30 తేదీల్లో నగరంలో నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక వర్గాలకు వారి పోరాటాలకు అండగా నిలుస్తున్న సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) మహాసభలకు ముఖ్యఅతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. ఎ.గపూర్, రాష్ట్ర కార్యదర్శి బాల కాశి హాజరవుతున్నారు. ఈ మహాసభల జయప్రదానికి కార్మిక, ఉద్యోగ వర్గాలు, పట్టణ ప్రజలు, విద్య, వైద్య, వ్యాపార సంస్థలు ఆర్థిక, హార్దిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకుల రాధాకృష్ణ ,అనిల్ కుమార్ రెడ్డి వెంకటేష్ , రాయుడు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలపై దృష్టి సారించాలి

కడప : జిల్లాలో పెండింగ్ విద్యుత్ బకాయిల వసూళ్లపై తగు చర్యలు తీసుకోవాలని, సంస్థ ఆర్థిక స్థిరత్వం కోసం ప్రతి ఉద్యోగీ కృషి చేయాలని ఎపి ఎస్‌పిడిసిఎల్ డిస్కం చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మ జ్ఞాని విద్యుత్ శాఖ అధికారులకు, ఇంజినీర్లకు, సిబ్బందికి సూచించారు. స్థానిక విద్యుత్ భవన్‌లో శుక్రవారం కడప డివిజన్ విద్యుత్ అధికారి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. ఎన్ ప్రసాద్, ఎస్ఇ ఎన్. ముని శంకరయ్య అధ్యక్షతన రెవెన్యూ, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా సిజిఎం మాట్లాడుతూ కడప డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయని, వాటిని వసూలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీడింగ్ ఆగిపోయిన మీటర్లను, కాలిపోయిన మీటర్లను గుర్తించి వెంటనే మార్చాలని తెలియజేశారు. సంస్థ ఆర్థిక స్థిరత్వం కోసం ప్రతి ఉద్యోగీ కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు కృషి చేయాలని తెలియజేశారు. అనంతరం కడప నార్త్ సెక్షన్, రూరల్ సెక్షన్స్ లోని సిబ్బందితో నేరుగా కలిసి బకాయిల వసూళ్లపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జె చిన్న రాఘవులు, కడప డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిజిఎం

కాండం కుళ్లు తెగుళ్లను నివారించాలి

ప్రజాశక్తి - వల్లూరు

వేరుశనగ పంటలో కాండం కుళ్ళు తెగుళ్లకు నివారణ చర్యలు చేప ట్టాలని వ్యవసాయ అధికారి సాయి జ్యోతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పైడి కాల్వ గ్రామాల్లో శనగ పంట పొలాలను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ శనగ పంటలో కాండం కుళ్ళు ఎక్కువగా ఉందని, నివారణ కోసం టెబుకోనోజోల్ 1.0 మిల్లీ లీటరు, లీటర్ నీటికి లేదా హెక్సా కొనోజోల్ 2 మిల్లీ లీటరు, లీటర్ నీటితో కలిపి శనగ పంట మొదలు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలని తెలిపారు. అలాగే 13.0.45 10 గ్రాములు లీటర్ నీటికి తెగుళ్ళ మందును కలిపి పిచ్చుకారి చేసుకోవాలని తెలిపారు. మినుము పంటలో బూడిద తెగుళ్లను గమనించి దీని నివారణకు మైక్లో బ్యూటానిల్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలి పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - రాయచోటి

నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఏఈలు, డిఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి రోజురోజుకూ పురోగతి కనిపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మంజూరైన ఇల్లన్నీ వందశాతం పూర్తి చేయించాలని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఒక్కో లబ్ధిదారునికి రూ. 35 వేలు రుణం ఇప్పించాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయించడంలో డిఆర్‌డిఏ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు నీటి సౌకర్యం, విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు సచివాలయం వారీగా ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షలు నిర్వహించి ఇచ్చిన లక్ష్యాన్ని సాధించాలన్నారు. కొన్ని మండలాల్లో అనుకున్న స్థాయిలో నిర్మాణాలు జరగడంలేదని, వచ్చే వారం నాటికి నిర్మాణాల్లో పురోగతి కనిపించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ ప్రసన్నకుమార్, డిఈ శ్రీనివాస్ రెడ్డి, సిపిఓ కృష్ణ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

చదువుతోపాటూ సమాజంపై అవగాహన

ప్రజాశక్తి-కడప అర్బన్

మారుతున్న విద్యాభ్యాసానికి అనుగుణంగా గతం, భవిష్యత్తు, వర్తమానాలు తెలియజేస్తూ విద్యాభ్యాసం చేయాలని, చదువుతోపాటు సమాజంపై అవగాహన కల్పించాలని సమగ్ర శిక్ష జిల్లా పథ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కడప డివిజన్ లెవెల్ పరిధిలో నిర్వహిస్తున్న సాల్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి రోజూ తప్పనిసరిగా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని చెప్పారు. రోజూ పాఠశాలకు రావడం వల్ల విద్యార్థులకు విద్యపై ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. ఉన్నత విలువలతో కూడిన ఉన్నత లక్ష్యాలు నిర్మించుకునేందుకు విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక, గ్రూప్ డిస్కషన్, స్టేజ్ ఫియర్ సరళమైన భాష వంటి వాటి పై ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడం వల్ల విద్యార్థులు సులభంగా భవిష్యత్తులో రాణించగలరని సూచించారు.

నేడు బిసి భవన్ శంకుస్థాపన

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని బిసిల చిరకాల స్వప్నమైన బిసి భవన నిర్మాణ శంకుస్థాపనను పాతరిమ్స్‌లో శనివారం ఉదయం చేయనున్నారని, బిసిలందరూ హాజరై విజయవంతం చేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందునాగరాజు, గౌరవ సలహాదారులు ఎ.వి.ఆర్. వెంకటేశ్వరు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎంఎల్‌ఎ రవీంద్రనాథరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు హాజరవుతారన్నారు.

రామన్ సైన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

కడప అర్బన్ : నగరంలోని గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో సర్ సి.వి.రామన్ సైన్స్ క్లబ్ డివిజన్ కార్యవర్గ సమావేశం శుక్రవారం గౌరవాధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్గించడానికి మరిన్ని ఆరోగ్య పర్యావరణ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి క్లబ్బు విస్తృతంగా కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రభుత్వ పురుషుల కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి. వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలలో శాస్త్రీయ అవగాహనకై రామన్ సైన్స్ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా సైన్స్ క్లబ్ కన్వీనర్ కె. విజయ మోహన్ రెడ్డి సూచనల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గునిశెట్టి శ్రీనివాసులు, గౌరవ సలహా దారులుగా డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డి, డి.వి.సుబ్బానాయుడు, అధ్యక్షులుగా ఆర్. శ్రీనివాసుల రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి. గంగాధర్, కోశాధికారిగా విజయ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా కె. బాలకృష్ణ ,సాంకేతిక సలహాదారుగా డా.బి.రామచంద్ర ఎన్నికయ్యారు.

విజయవాడలోని వడ్డేశ్వరంలో నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ రాష్ట్ర వర్క్‌షాప్‌కు జిల్లా ప్రతినిధులుగా హాజరైన జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్

హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ 17వ అఖిల భారత మహాసభలకు హాజరైన ఎస్ఎఫ్ఐ కడప, అన్నమయ్య జిల్లా కార్యదర్శులు సగిలి రాజేంద్ర ప్రసాద్, సర్వేపల్లి నరసింహా

డ్రాగా ముగిసిన మ్యాచ్

ప్రజాశక్తి - కడప

కడపలోని కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో రెండు రోజులపాటు సౌత్ జోన్- నార్త్ జోన్ జట్ల మధ్య జరిగిన ఏసీఏ అండర్ -25 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్ డ్రాగ ముగిసింది. ఈ మ్యాచ్‌లో సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 270 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా అయిదు పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నార్త్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 77 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 372 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని ఎం. హర్ష వర్ధన్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 100 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు. అవినాష్ 92, సాత్విక్ 51 పరుగులు చేశారు. సౌత్ జోన్ జట్టులోని ఎం. ఆంజనేయులు 4, సంజయ్ నాయుడు 4 వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

నేడు శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ కథాకార్యశాల రెండురోజుల శిక్షణా తరగతులు శనివారం స్థానిక విశ్వేశ్వరయ్య భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ముఖ్యఅతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ కేతు విశ్వనాథ రెడ్డి, ప్రసిద్ధ కథా రచయిత షేక్ హుస్సేన్ సత్యాగ్ని హాజరవుతున్నారు. విశిష్ట అతిధులుగా ప్రసిద్ధ కథ, నవలా రచయితలు బండి నారాయణ స్వామి, డాక్టర్ శాంతి నారాయణ పాల్గొంటారు. వర్తమాన రచయితలకు కథా రచనపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి ఇప్పటికే రాయలసీమ వ్యాప్తంగా ఉన్న 40 మంది వర్తమాన రచయితలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శిక్షణ తరగతులు, పుస్తకావిష్కరణ సందర్భంగా వివిధ రచయితల పుస్తకాలు 50 శాతం తో వేదిక వద్ద లభిస్తాయని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పీడీ తనిఖీలు

ప్రజాశక్తి-చెన్నూరు

అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు సక్రమమైన సమన్వయం లేకపోవడంతో ప్రజల ఫిర్యాదు మేరకు తాను కేంద్రాలను తనిఖీ చేస్తున్నానని ఐసిడిఎస్ పీడీ ఎం.ఎల్. రాణి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె చెన్నూరులో ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్‌తో కలసి అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు 1,2,4,6వ వార్డుల్లోని కేంద్రాలను సందర్శించారు. అక్కడ పిల్లలు లేకపోవడంతో కార్యకర్తలను, ఆయాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లో మాత్రమే హాజరు చూపుతున్నారని పేర్కొన్నారు. 6వ వార్డు కేంద్రంలో కార్యకర్తలు, ఆయాలు పిల్లలను సక్రమంగా చూడకపోవడంతో తల్లిదండ్రులు పంపడం మానేశారనే ఫిర్యాదులున్నాయన్నారు. ఒకరిపై ఒకరు సఖ్యత లేకపోతే పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఇది మంచి పరిణామం కాదని ఎంపిపి అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్

మెప్మా పథక సంచాలకుల రాష్ట్ర మెప్మా ఎంప్లాయిస్ యూనియన్, సిబ్బంది ఆధ్వర్యంలో సెమీ క్రిస్మమస్ వేడుకలు కేక్ కటింగ్ తో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రతి ఒక్కరూ నిర్వహించుకుని సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మెప్మా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు.యల్. లోమడ గంగులయ్య, వై.సురేష్ రెడ్డి, ఏవో యస్. అమీర్ సాహెబ్, సీనియర్, ఐ.బి, టి.నాగరాజు, ఐహెచ్ డి.జి.వి గోపీనాథ్, బి.ఎల్. హెచ్.ఎన్, సిబ్బంది టిఎల్ఎఫ్ ఆర్పీలు, ఓబిలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతోనే విజ్ఞానం

ప్రజాశకి-కడప

క్షేత్ర పర్యటన ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా విజ్ఞానాన్ని పెంపొందించవచ్చునని ప్రభుత్వ పురుషుల కళాశాల జువాలజీ (జంతుశాస్త్ర) విభాగాధిపతి డాక్టర్ పి. రవి శేఖర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ పురుషుల కళాశాల లోని జంతుశాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటనలో భాగంగా యోగి వేమన యూనివర్సిటీని సందర్శించారు. విశ్వవిద్యాలయంలోని సీతాకోక చిలుకల సందర్శనశాల విద్యార్థులను ఎంతగానో ఆకర్షించింది. సందర్శనశాలలో భద్రపరచినటువంటి వివిధ రకాల కీటకాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. వివిధ రకాల పరికరాలను, వాటి పని విధానం గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ ఆచ్చర్యులు, ఏ. టి. వెంకట రమణ రెడ్డి, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ లోకేష్, డాక్టర్ మరియాదాస్,మనస్విత, అధ్యాపకులు డాక్టర్ వై. సావిత్రి, డాక్టర్ నరసింహా రావు, నాగేంద్ర కుమార్, శ్రీనిత విద్యార్థులు పాల్గొన్నారు.

వైవియూను సందర్శిస్తున్న అధ్యాపకులు విద్యార్థులు

చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న చైర్మన్, కమిషనర్

ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక 17వ వార్డులో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ జగన్నాథ్ పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ఇంటింటికి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి 3 బుట్టలను ఇస్తున్నామన్నారు. వీటిని సద్వినియోగం చేసు కోవాలని వారు కోరారు. తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకర చెత్తగా వేరు చేసి తమ ఇంటి వద్దకు వచ్చు మున్సిపల్ వాహ నాలకు అందివ్వాలన్నారు. ఎరుపు, నీలం, పచ్చరంగు బుట్టలను ప్రజలు సక్ర మంగా వినియోగించుకొని చెత్త రహిత ఎర్రగుంట్లకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కౌన్సిలర్లు, నగర పంచాయితీ మేనేజర్ పుల్లయ్య, ఆర్ఒ గంగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ జి.సావిత్రమ్మ

ప్రజాశక్తి - మైదుకూరు

శ్రీ ప్రవళిక సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్

ప్రతి ఒక్కరూ పంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని శ్రీ ప్రవళిక డెంటల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సావిత్రమ్మ సూచించారు. పంటి సమస్యలపై శుక్రవారం ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ పంటి సమస్యలతో పలు రకాల అనారోగ్య విషయాలు తలెత్తే అవవాశం ఉం దన్నారు. ఏ చిన్నపాటి సమస్య వచ్చినా వెంటనే పంటి వైద్యులను సంప్ర దించాలని ఆమె సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మైదుకూరు పట్టణంలో అన్ని రకాల వసతులతో శ్రీ ప్రవళిక సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వైద్యశాలను బద్వేల్ రోడ్డులో అందుబాటులోకి తెచ్చామని డాక్టర్ జి.సావిత్రి పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఇహెచ్ఎస్, పింఛన్‌దారులకు, హెల్త్ కార్డు కలిగిన విలేకరులకు క్యాష్ లెస్ చికిత్సకు ప్రవళిక సూపర్ స్పెషాలిటీలో అవకాశం ఉందన్నారు. కట్టుడు పళ్ళను అమర్చడం, పళ్లు లేని వారికి కృత్రిమ దంతాలు అమర్చడం, చిగురు వ్యాధికి చికిత్స, ఎత్తు వంకర పళ్లను సరి చేయడం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. మైదుకూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - ఖాజీపేట

మాండూస్ తుపాన్ ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని టిడిపి మండలశాఖ అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, టిడిపి మండల నాయకులు సందుల నాగశివారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలకు పత్తి, వరి, మినుము పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. వ్యవ సాయ అధికారుల క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నష్టపోయిన ప్రతి రైతుకు పెట్టుబడి వర్తింపజేయడంతోపాటు, పంటల బీమా మంజూరు చేయాలన్నారు. రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహశీల్దార్, ఎఒకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి టిడిపి నాయకులు తహశీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని వారు కోరారు.

రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పజాశక్తి - ప్రొద్దుటూరు

రక్తహీనత లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ విద్యార్థులకు సూచించారు.

రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

2వ వార్డు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వైయంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం 10 నుంచి 19ఏళ్ల వయసున్న బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, బరువు, ఎత్తు కొలతలు తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయిలకు హిమోగ్లోబిన్12 గ్రాములపైన ఉండాలన్నారు. రక్తహీనత వల్ల ఎదురయ్యే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశు భ్రతలో చేతులు శుభ్రం చేసుకునే విధానం గురించి వివరించారు. రక్తం పెరగాలంటే తీసుకోవాల్సిన ఆహారాన్ని సూచించారు. అనంతరం 52 మంది బాలికలకు వార్డు హెల్త్ కార్యదర్శి రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ గీత, సిఒ సుబ్బారెడ్డి, ఆశాలు గంగాదేవి, రమణమ్మ పాల్గొన్నారు.

రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆవోపా అధ్యక్షులు పుల్లగూర గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల అవోపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వైద్య శిబిరానికి కడపకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు వెంకట శేషఫణి వస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జెఇ చంద్రశేఖర్ తెలిపారు. 33/11 కెవికి సంబంధించిన వేంపల్లె, తాళ్లపల్లె, గిడ్డంగివారిపల్లె, టి వెలమవారిపల్లె, ట్రిపుల్‌ఐటిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేంపల్లెతోపాటు ఆయా గ్రామాల్లో ఉదయం 8.30 నుండి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మోటర్ బైకును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

- చిన్నారితో పాటు మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రమాదంలో గాయపడిన నందిని

స్థానిక గండి రోడ్డులోని హెచ్‌పి పెట్రోలు బంకు వద్ద శుక్రవారం మోటర్ బైకును ఆర్‌టిసి బస్సు ఢీ కొన్న సంఘటనలో ఓ చిన్నారితోపాటు, మరో భార్య భర్తలకు తీవ్ర గాయా లయ్యాయి. స్థానిక శ్రీరాం నగర్‌కు చెందిన భార్యభర్తలు వనుం ప్రసాద్, నందిని రెండేళ్ల తన మేనల్లుడు జ్ఞానేశ్వర్‌ను తీసుకొని మోటర్ బైకులో వెళుతుండగా, హెచ్‌పి పెట్రోలు బంకు వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో రాయచోటి నుండి వేంపల్లెకు వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. దీంతో మోటర్ బైకులో ప్రయాణిస్తున్న ప్రసాద్, నందినితోపాటు రెండేళ్ల చిన్నారి కింద పడ్డారు. నందిని, చిన్నారి జ్ఞానేశ్వర్‌కు కాళ్లు, చేతులు విరగ్గా ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యురాలు మల్లేశ్వరమ్మ ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తిరుపాల్ నాయక్ తెలిపారు.

పత్తి రైతులు విలవిల

- క్వింటా ధర రూ.6,800,
- దిగుబడి ఎకరాకు రెండు క్వింటాళ్లే
- పెట్టుబడి అధికం
- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆరుగాలం కష్టించే రైతులు అతివృష్టి, అనావృష్టి వల్ల ప్రతి ఏడాది నష్టాలపాలవుతున్నారు. ఓవైపు పంట సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక, మరోవైపు కుటుంబ పోషణ భారమై వారు అల్లాడ పోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, నాయకులు రైతు అభ్యున్నతికి పాటుపడలేదనే విమర్శలున్నాయి. ఖరీఫ్‌లో సాగుచేసిన ఉల్లి పంట రైతులను నిలువునా ముంచేసింది. ఉల్లి పంట కోసం ఎకరాకు రూ.70వేలు ఖర్చుపెట్టారు. పంట కోతకు వచ్చే సమయానికి అకాల వర్షాలు, తెగుళ్లతో ఉల్లి పంట దెబ్బతింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు చేతికి రాలేదని, రబీలోనైనా పంటలు వస్తే పది రూపాయలు చేతికొస్తాయని ఆశించామని, ఆ ఆశలు అడియాశలయ్యాయని రైతులు లబోదిబోమంటున్నారు. రబీలో పులివెందుల రెవిన్యూ డివిజన్ పరిధిలోని పులివెందుల, వేముల, వేంపల్లి, తొండూరు, సింహాద్రిపురం, వీరపునాయునిపల్లె, లింగాల మండలంలో దాదాపు 3000 ఎకరాల్లో పత్తి సాగైనట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. రబీలో సాగు చేసిన పత్తి పంటకు ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టామని, దిగుబడి చేతికందే సమయంలో చీడపీడలు ఆశించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు క్రిమిసంహారక మందులను పిచికారి చేసినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పత్తి క్వింటా ధర రూ.6800 ఉందని, ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. రెండు క్వింటాళ్లకు కేవలం రూ.15,600 వచ్చిందన్నారు. పంట సాగు కోసం రూ.30 వేలు పెట్టాన్నారు. ఎపిలో పత్తి పంటకు కేంద్ర బిందువైన కర్నూలు జిల్లా ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు తగ్గుముఖం పట్టడంతో వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రావడంలేదు. ఈ పరిస్థితుల్లో రైతుల ఇళ్లల్లోనే పత్తి నిల్వలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మార్కెట్లో పత్తి క్వింటా ధర కనిష్టంగా రూ.5,390 కాగా, గరిష్టంగా రూ.8,460 ఉంది. జాతీయ మార్కెట్లో పత్తికి డిమాండ్ లేకపోవడంతో ధరలు తగ్గుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. తెగుళ్లకు తోడు ఇటీవల కురిసిన వర్షాలకు కాస్తోకూస్తో కాపు ఉంటే అవి కూడా రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాగులో ఉన్న పత్తిపంట

పత్తి రైతు.. పెట్టుబడి దక్కితే ఒట్టు

ఖాజీపేట : తుపాను ప్రభావం వల్ల పత్తి, వరి రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. మండల వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారుల గణాంకాలు పేర్కొన్నాయి. తవ్వారిపల్లె, మిడుతూరు, త్రిపురవరం, కూన వారిపల్లె, భూమాయపల్లె, బి.కొత్తపల్లె గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. వర్షాలకు పత్తిలో కాయ, పూత పూర్తిగా రాలిపోయిందని తవ్వారిపల్లెకు చెందిన రైతు రామిరెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభు త్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దెబ్బతిన పత్తి పంటను చూసి కన్నీటి పర్యంతమైన రైతు రామిరెడ్డి

సూచనలు పాటించండి.. విద్యుత్ ఆదా చేయండి

ప్రజాశక్తి - మైదుకూరు

సూచనలు పాటించండి.. విద్యుత్‌ను ఆదా చేయండని విద్యుత్ సిబ్బంది కోరారు. విద్యుత్ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద డిఇఇ జివి రామిరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఇడి బల్బుల వాడాలన్నారు. దీనివల్ల 60 శాతం విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులను రిమోట్ ద్వారా కాకుండా స్విచ్ ద్వారా ఆఫ్ చేయడం వలన విద్యుత్ ఆదా చేయవచ్చని సూచించారు. ఒక ఎసి 30 ఫ్యాన్ల వినియోగంతో సమానమని గుర్తించాలన్నారు. కరెంటు లోడు ఎక్కువగా ఉండే సమయాల్లో అంటే ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6 నుండి రాత్రి 10 గంటల వరకు అత్యవసరమైన పనులకు మాత్రమే విద్యుత్ వాడాలన్నారు. తద్వారా నాణ్యమైన విద్యుత్ అందరికీ అందించవచ్చని ఆయన సూచించారు. ర్యాలీలో మైదుకూరు సబ్ డివిజన్ అధికారి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.ఆర్.శ్రీనివాసులరెడ్డి, ఎఇలు, అకౌంట్స్ విభాగం, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఇ జివి రామిరెడ్డి

ఆటో వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయండి

వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగులో ఈనెల 20న నిర్వహించే ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధం పట్టణ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు ఏరియా ఉపాధ్యక్షులు వీరనాల శివ నారాయణ, జమ్మలమడుగు ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు దాసరి విజయ్ కోరారు. పట్టణ మహాసభకు సంబంధించి శుక్రవారం పాత బస్టాండ్‌లో ఆటో స్టాండ్ వద్ద వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ మహాసభకు ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ హాజరవుతున్నారని తెలిపారు. 20న స్థానిక మండల కార్యాలయం అవరణ నుండి పాత బస్టాండ్ వరకు భారీ ఆటో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆటో స్టాండ్‌లో సభ ఏర్పాటు చేశామన్నారు. ప్రధానంగా మహాసభలో ఆటో కార్మికుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, రఘు, అబ్రహం, రవి, సుబహాన పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం.. పట్టని అధికారులు

నీరు ప్రవహించి అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - ముద్దనూరు

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలనే నానుడి పాలకులకు పట్టనట్లుంది. ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అంటూ.. రోడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ వ్యవస్థ ఉద్యోగుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలున్నాయి. సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటించకుండా విధుల పట్ల అలసత్వం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ, సచి వాలయం కార్యదర్శులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించకుండా సచివాలయానికే పరిమితమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించి ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విని పిస్తున్నాయి. మండలంలోని ఉమ్మారెడ్డిపల్లె, నొస్సంవారిపల్లె, రాజుల గురువాయపల్లె, ఉప్పలూరు గ్రామాల్లో ప్రధాన రహదారి వీధుల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పారిశుధ్యం లోపించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాలు కురిస్తే నీరు పోయేందుకు మురుగు కాల్వలు లేక రోడ్లపై నిలిచి అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు, ఇళ్లల్లోంచి వచ్చే నీరు రోడ్లపై నిలిచి పాచి పడుతోంది. మురుగునీరుగా మారి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు హడలిపోతున్నారు. దోమల బెడద తీవ్రంగా ఉందని వాపోతున్నారు. ఉమ్మారెడ్డిపల్లెలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ పది చోట్ల పగిలిపోయి, నీరు వథాగా పోతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాముడి దేవాలయం వద్ద నీరు నిలవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రతి వీధిలో నీరు నిలుస్తోంది. సమస్యలను పలుమార్లు పంచాయతీ, సచివాలయం కార్యదర్శి, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పగిలిపోయిన తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్యలను ఏకరువు పెడుతున్న మహిళలు

ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మల్లేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎంపిపి వీరనారాయణ రెడ్డి, ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం వారు విద్యార్థులతో కలిసి మల్లేపల్లె హైస్కూల్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దలు డిప్యూటీ ఇఒతో సమస్యను స్పష్టంగా వివరించారు. ప్రధాన రహదారిపై గంట సేపు బైఠాయించారు. ప్రధానోపాధ్యాయుడితోపాటు మరో ఉపాధ్యాయుడిని కూడా సస్పెండ్ చేయాలన్నారు. ఎంఇఒ పుల్లయ్యను బదిలీ చేయాలని నినాదాలు చేశారు. సమస్యలను డిప్యూటీ డిఇఒ రాజగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ డిఇఒ, ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డికి జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా వివరించారు. దీనిపై స్పందించిన ఆర్‌జెడి సంబంధిత హెడ్మాస్టర్, టీచర్‌పై బాధితుల ద్వారా ఫిర్యాదు తీసుకుంటే వారిపై సస్పెండ్‌కు చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు డిప్యూటీ డిఇఒ హామీ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ డిఇఒ రాజగోపాల్ రెడ్డి ధర్నా దగ్గరకు చేరుకుని వివాదాలు ఎదుర్కొంటున్న వారిపై వైసిపి నాయకులు దుగ్గిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు భర్త రాజా నాయుడు, పాల రామిరెడ్డి, కొండారెడ్డి, జోగయ్య, విద్యా కమిటీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కలివేల రాజశేఖర్, ఎర్రంపల్లి అజయ్, మనోజ్, సిద్ధు, సునీల్, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న ఎంపిపి వీరనారాయణరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - రాజంపేట అర్బన్

పురపాలక పరిధిలోని స్వచ్ఛ సర్వేక్షన్-2022 క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఇన్ఫాంట్ పాఠశాలకు చెందిన జి.విశ్వద (9వ తరగతి) ప్రథమ బహుమతి, మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గీతిక ద్వితీయ బహుమతి, జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎస్.జబీల తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు శుక్రవారం పురపాలక కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక అవగాహన కల్పించడం కోసం ఈ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రెడ్డిమాసి రమేష్ నాయుడు, మున్సిపల్ మేనేజర్ పి.శేషఫణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శంకర్, వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చలికాలంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

చలికాలంలో వసతిగృహ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు డివి సందీప్ సూచించారు. మండల పరిధిలోని అన్నవరం ప్రభుత్వ బిసి బాలుర వసతిగృహంలో శుక్రవారం వసతి గృహ అధికారి ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో జలుబు, దగ్గు, చర్మ వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు వివరించారు. శిబిరంలో 44 మంది విద్యార్థులను పరీక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వి.బ్రహ్మయ్య, జమ్మలమడుగు డివిజన్ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ బిడి కృష్ణయ్య, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్‌కుమార్, ఎంఎల్‌హెచ్ రుషి, గుడిపాడు హాస్టల్ వార్డెన్ నాగకుమార్, ఎఎన్ఎం మేరీ, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో సాయం పొందవచ్చు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్, మహిళా పోలీసులు

దిశ యాప్ డౌన్‌లోడ్ వల్ల ఆపద, అత్యవసర సమయాల్లో తమను తాము రక్షించుకునే సాయం పొందవచ్చని ప్రిన్సిపల్ రవి కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జెండర్ ఈక్వాలిటీ క్యాంపెయిన్‌లో భాగంగా దిశ యాప్, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దిశ యాప్‌పై స్థానిక మహిళా పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రయోజనాలను, గృహహింస చట్టాలను వివరించారు. కార్యక్రమంలో కో- ఆర్డినేటర్ విజయ దుర్గ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - కొండాపురం

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు సూచించారు. మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. వార్షిక తనిఖీలో భాగంగా డిఎస్‌పి విచ్చేశారు. స్టేషన్ పరిధిలోని కేసుల వివరాలను, వాటి పూర్వపరాలను ఎస్ఐ రవికుమార్‌తో చర్చించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి పోలీసులు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల గురించి సిబ్బందికి తెలియజేశారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న డిఎస్‌పి నాగరాజు

శ్మశాన వాటిక విస్తీర్ణాన్ని పెంచాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

శ్మశాన వాటిక విస్తీర్ణం పెంచాలని రాజీవ్ నగర్ కాలనీ వాసులు శుక్రవారం సచివాలయంలో డిజిటల్ అధికారి తులసికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రాజీవ్‌నగర్ కాలనీ వాసులకు గతంలో ఎనిమిది సెంట్ల స్థలం కేటాయించారన్నారు. అయితే కాలనీలో రెండు వేలకు పైగా జనాభా ఉందన్నారు. ఆ స్థలం సరిపోవడం లేదన్నారు. శ్మశాన వాటికకు చని పోయిన వారిని తీసుకుపోవాలంటే రహదారి సరిగా లేనందున ఇబ్బందులు పడుతున్నామన్నారు. నీటి పారుదలతో కంప చెట్లు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. శ్మశాన వాటికకు స్థలంతోపాటు, దారి, కుళాయి ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వీరభద్ర, రఘునాథ, రంగనాయకులు, కటిక నరసింహ, నారాయణ, నాగేంద్ర, సుబ్బరాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రాజీవ్ నగర్ కాలనీ ప్రజలు

పూడికతీత పనులు చేపట్టాలి

చాపాడు ఎస్‌సి కాలనీలో పేరుకుపోయిన మురుగు

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడులో మురుగు కాలువల్లోని పూడికతీత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మురుగు కాలువ పూడికతో పూర్తిగా నిండి పోయింది. మురుగు నీరు ప్రవహించే అవకాశం లేదు. కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థ పదార్థాలతో నిండిపోయింది. ప్రస్తుతం పంట పొలాలకు కెసి కాలువలో పూడికతో నిండడం వల్ల నీరు రోడ్డుపై పారుతోంది. గత వారంలో హైస్కూల్ సమీపంలో నీరు రోడ్డు పైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాపాడు ప్రధాన రోడ్డు వెంబడి డ్రయినేజి కాలువ అందుబాటులో ఉంది. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై రోడ్డుకిరువైపులా అందు బాటులో లేదు. నేషనల్ హైవే అధికారులు కాలువను ఏర్పాటు చేసి గ్రామంలోని కాలువకు అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో ఎస్‌సి కాలనీలో నీరు రోడ్లపైనే నిలుస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది. ప్రస్తుతం కాలువల ఏర్పాటుకు అవకాశం ఉన్నందున అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA.

O.S.NO. 777/ 2021

Adavi Venkata Subbarayudu, S/o Venkata Subbaiah, Aged 50 years, Hindu, R/o. D.No. 11-95, Aswarthugaripalli Village, Chinthakommadinne Mandal, Kadapa Dist. ...వాది

Vs

Sangireddy Lakshmidevi, W/o Sangireddy Venkata Kulaya Reddy, Hindu Aged 43 years, R/o D.No.7/1, Obulapuram Village, Kondapuram Mandal, Kadapa Dist. ...ప్రతివాది

ప్రతివాదికి నోటీసు

పైన తెలిపిన దావాలో వాది ప్రతివాది అయిన మీ పైన దావా దాఖలు చేసియున్నాడు. ఆ దావా నెంబర్ O.S.No. 777/2021 సదరు దావా 19/12/2022 తేదిన ఉంటు ఉన్నది. సదరు దావా తేది నాటికి మీరు గాని మీ తరపున వకీలు గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీ పైన పరోక్షముగా తీర్మానించబడును.

వి.రామమోహన్
కె.రామమోహన్
అడ్వకేట్స్, కడప.

త్వరలో కొత్త జీవితం

పెద్దదర్గాలో హీరో మంచు మనోజ్ ప్రార్థనలు

పెద్దదర్గాలో ప్రార్థనలు చేస్తున్న హీరో మనోజ్

కడప అర్బన్: త్వరలోనే కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నానని హీరో మంచుమనోజ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో పెద్ద దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా సంప్రదాయం ప్రకారం మంచు మనోజ్ తలకు పాగా చుట్టి దర్గా ముజావర్లు ఘనంగా స్వాగతం పలికారు. దర్గా విశిష్ఠతను అడిగి తెలుసుకున్నారు. దర్గాకు రావడం చాలా సంతోషంగా ఉందని, ఎప్పటి నుంచో ఇక్కడికి రావాలని అనుకుంటున్నానని చెప్పారు. త్వరలో కొత్త సినిమాలు చేయనున్నానని, మళ్లీ కుటుంబ సభ్యులతో దర్గాను సందర్శిస్తానని చెప్పారు.

డేంజర్‌జోన్‌లో ఆ ముగ్గురు!

మార్చి సమీక్ష నాటికి మెరుగుపరుచుకోండి

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే 'రాచమల్లు'కు ప్రశంస

గడపగడపకూ సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ప్రజాశక్తి - కడపప్రతినిధి

గడప గడపకూ ప్రభుత్వం సమీక్షలో ముగ్గురు ఎమ్మెల్యేలకు డేంజర్‌జోన్‌లో ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన శుక్రవారం విజయవాడలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నాలుగు నెలల కిందట నిర్వహించిన సమీక్షలో డేంజర్‌జోన్, సేఫ్‌జోన్ పేర్లతో కూడిన జాబితాలను ప్రకటించారు. డేంజర్‌జోన్ జాబితాలో కొంత మంది ఉన్న విషయం తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ ఎమ్మెల్యేలు చురుకుగా పాల్గొనలేదని, క్షేత్రస్థాయిలో వ్యతిరేకత కనిపిస్తోందని సర్వేలు వెల్లడిస్తున్నట్లు హెచ్చరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయే నేతలకు టికెట్లు ఇవ్వడం కదరదని తేల్చేసిన నేపథ్యంలో గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. సచివాలయం పరిధిలో వారంలో కనీసం నాలుగు రోజుల చొప్పున నెలకు 16 రోజులపాటు ఇంటింటికి వెళ్లి ప్రజలతో సంబంధాలు నెరపాలని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకోవాలని, వ్యక్తిగత సమస్యలు ఉంటే పరిష్కరించి ప్రజల మనసుల్ని గెలుచుకు రావాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలను అమలు చేయని ఎమ్మెల్యేలను తాజా సమీక్షలో సుతిమెత్తంగానే హెచ్చరించినట్లు తెలిసింది. గతంలో చేసిన హెచ్చరికల నేపథ్యంలో 40 శాతం మంది ఎమ్మెల్యేల పనితీరులో మెరుగుదల కనిపించిందని, కానీ ఇప్పటికీ చాలా మంది డేంజర్‌జోన్ జాబితాలోనే ఉన్నారని, వచ్చే నవంబర్‌లో నిర్వహించే సమీక్ష నాటికి పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించినట్లు తెలిసింది. లేనిపక్షంలో 2024 సార్వత్రిక ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట చేపట్టిన పాదయాత్ర సందర్భంగా మీతో కలిసి నడిచానని, అటువంటి మిమ్మల్ని పోగొట్టుకోవాల్సిన దుస్థితిని తీసుకురావొద్దని, తన ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. 30 రోజుల వ్యవధిలో 12 నుంచి 16 రోజుల పాటు గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో సీరియస్‌గా పాల్గొని, తమ పనితీరును, సమర్థతను పెంచుకోవాలని సూచించినట్లు తెలిసింది. లేని పక్షంలో 2024 సార్వత్రిక ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో సర్వే ప్రకారం సమర్థత ఆధారంగా టికెట్లను కేటాయించాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సమీక్షా సమావేశంలో డేంజర్‌జోన్ జాబితాలోని పేర్లను చదివి వినిపించినట్లు సమాచారం.

మరోసారి ముగ్గురే..!

కడప, అన్నమయ్య జిల్లాలోని ముగ్గరు ఎమ్మెల్యేలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కడప జిల్లాలో మైదుకూరు, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తంబళ్లపల్లి ఎమ్మెల్యేల డేంజర్‌జోన్ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమ నిర్వహణలో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు కైవసం చేసుకోవడంతో ప్రశంసించినట్లు సమాచారం. గత సమీక్ష సందర్భంగా నియోజకవర్గాల పరిధిలోని ఆయా సచివాలయాల పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేల్లో సార్వత్రిక ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో డేంజర్, సేఫ్‌జోన్ అనే తేడాలతో నిమిత్తం లేకుండా టెన్షన్ వాతావరణం నెలకొనడం గమనార్హం. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మోకాలికి శస్త్రచికిత్స చేసుకోవడంతో ఆయన గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొనలేకపోయారని తెలిసింది. కొద్ది రోజు లు విశ్రాంతి అనంతరం ఆయన కార్యక్రమాల్లో చురుగ్గాపాల్గొంటున్నారనే భావన సిఎంకు వచ్చినట్లు సమాచారం.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

సమీక్షా సమావేశంలో కలెక్టర్ గిరీష

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఎఇలు, డిఇలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి రోజురోజుకు పురోగతి కనిపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మంజూరైన ఇళ్లన్నీ 100 శాతం పూర్తి చేయించాలని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఒక్కో లబ్ధిదారునికి రూ.35 వేలు రుణం ఇప్పించాలన్నారు. హౌసింగ్ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయించడంలో డిఆర్‌డిఎ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు నీటి సౌకర్యం, విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకుని లేఅవుట్ వారీగా ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఎంపిడిఒలు సచివాలయం వారీగా ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షలు నిర్వహించి ఇచ్చిన లక్ష్యాన్ని సాధించాలన్నారు. కొన్ని మండలాల్లో అనుకున్న స్థాయిలో నిర్మాణాలు జరగడంలేదని, వచ్చే వారం నాటికి నిర్మాణాల్లో పురోగతి కనిపించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద జిల్లాలో మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులందరూ చర్యలు చేపట్టాలన్నారు. పిఎంఎవై గ్రామీణ్ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇంకా ప్రారంభం కాని ఇంటి నిర్మాణాలు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఈ దిశగా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.ఈ సందర్భంగా మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, డిఇ శ్రీనివాస్‌రెడ్డి, సిపిఒ కృష్ణనాయక్, మున్సిపల్ కమిషనర్ రాంబాబు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు

టిడ్కోలో మౌలిక వసతులు యుద్ధప్రాతిపదికన కల్పించాలని అధికారులను, కాంట్రాక్టర్లను కలెక్టర్ గిరీష ఆదేశించారు. పట్టణ ప్రాంత పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేసే ప్రక్రియ వేగవంతం చేసేందుకు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మదనపల్లి టిడ్కో గృహాల్లో మౌలిక పనులన్నీ మొదలుపెట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. సిసి రోడ్లు, ఇంటింటికీ నీటి కనెక్షన్, అండర్ డ్రైనేజ్ తదితర పనులన్నీ జనవరి చివరిలోగా పూర్తి చేయాలన్నారు. ఎస్‌టిపి పనులను వారంలోగా పూర్తి చేయాలన్నారు. మదనపల్లి, రాయచోటి టిడ్కోలో ఎంత మంది లబ్ధిదారులు, ఎన్ని పూర్తి అయ్యాయి, ఇంకా ఎన్ని పూర్తి చేయాలి వంటి వివరాలను మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకుని పెండింగ్ పనులన్నీ త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వచ్చే వారం కల్లా పనులన్నీ ప్రారంభం కావాలన్నారు. రాయచోటి టిడ్కోలో పెండింగ్ పనులను జనవరి మొదటి వారంలోగా పనులు ప్రారంభించాలన్నారు. సమీక్షలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ రాంబాబు, టిడ్కో డిఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి ఇస్తున్న పోలా శ్రీనివాసులురెడ్డి

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పురపాలక పరిధిలోని స్వచ్ఛ సర్వేక్షన్-2022 క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఇన్ఫాంట్ పాఠశాలకు చెందిన జి.విశ్వద (9వ తరగతి) ప్రథమ బహుమతి, మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గీతిక ద్వితీయ బహుమతి, జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎస్.జబీల తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు శుక్రవారం పురపాలక కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఎం.జనార్ధన్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక అవగాహన కల్పించడం కోసం ఈ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రెడ్డిమాసి రమేష్ నాయుడు, మున్సిపల్ మేనేజర్ పి.శేషఫణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శంకర్, వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - రాజంపేట

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్య తరువాత గేట్ అనే ప్రామాణికం ద్వారా పొందే ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్ ఈజీ సంస్థ ఎడ్యుకేషనలిస్టు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్స్, గోల్డ్ మెడలిస్ట్ జితేంద్ర తివారీ, అబ్దుల్ రఫీక్ వారు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలి, గేట్ అండ్ ఈఎస్ఈ పరీక్షలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, అన్ని విభాగాల హెచ్ఒడిలు, డీన్స్, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మెర్రిన్ ప్రసన్న కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న లోక్ అదాలత్

మదనపల్లె అర్బన్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు సెకండ్ అడిషనల్ డిస్టిక్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ పి.భాస్కరరావు తెలిపారు. ఈ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్టులో ఉన్న పెండింగ్ సివిల్ కేసులు, రాజీదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో అప్పీలు లేని అంతిమ తీర్పుని ఏళ్ల తరబడి ఉన్న కేసులు కూడా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

మదనపల్లె అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని జానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద ఆశీస్సులతో పెంచుపాడు రోడ్డులోని గణపతి సచ్చిదానం ఆశ్రమ ప్రతినిధి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో అనఘాష్టమి వ్రతం వేడుకగా నిర్వహించారు. ఈ సందఠరేగా గురుప్రసాద్ మాట్లాడుతూ చదువు, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లే తల్లిదండ్రుల పట్ల గౌరవం, దేవుడి పట్ల భక్తి వుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలపై దృష్టి సారించాలి

కడప : జిల్లాలో పెండింగ్ విద్యుత్ బకాయిల వసూళ్లపై తగు చర్యలు తీసుకోవాలని, సంస్థ ఆర్థిక స్థిరత్వం కోసం ప్రతి ఉద్యోకీ కృషి చేయాలని ఎపి ఎస్‌పిడిసిఎల్ డిస్కం చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మ జ్ఞాని విద్యుత్ శాఖ అధికారులకు, ఇంజి నీర్లకు, సిబ్బందికి సూచించారు. స్థానిక విద్యుత్ భవన్‌లో శుక్రవారం కడప డివిజన్ విద్యుత్ అధికారి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. ఎన్ ప్రసాద్, ఎస్ఇ ఎన్. ముని శంకరయ్య అధ్యక్షతన రెవెన్యూ, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా సిజిఎం మాట్లాడుతూ కడప డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయని, వాటిని వసూలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీడింగ్ ఆగిపోయిన మీటర్లను, కాలిపోయిన మీటర్లను గుర్తించి వెంటనే మార్చాలని తెలియజేశారు. సంస్థ ఆర్థిక స్థిరత్వం కోసం ప్రతి ఉద్యోగీ కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు కృషి చేయాలని తెలియజేశారు. అనంతరం కడప నార్త్ సెక్షన్, రూరల్ సెక్షన్స్ లోని సిబ్బందితో నేరుగా కలిసి బకాయిల వసూ ళ్లపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జె చిన్న రాఘవులు, కడప డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను అధిగమించాం

- లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డిఎం వెంకటేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్ణీత లక్ష్యం కన్నా అధికంగా బ్యాంక్ లింకేజీ రుణాలను ఇచ్చినట్లు ఎస్‌బిఐ లీడ్ బ్యాంక్ మేనేజరు పి. వెంకటేశ్వ రెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం పీలేరు, కెవి పల్లి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి మండలాల బ్యాంక్ బ్యాంక్ మేనేజర్లు, ఏపిఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ జిల్లాఓ ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.9,381 కోట్లు రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఇప్పటి వరకు రూ.13,648 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. సుమారు 140 శాతం రుణాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయానికి రూ.5,302 కోట్లు రుణాలు లక్ష్యంకాగా ఇప్పటి వరకు రూ.7,878 కోట్లు ఇచ్చి 149 శాతాన్ని సాధించినట్లు చెప్పారు. ఎమ్ఎస్ఎంఇ (చిన్న, మధ్య తరహా రుణాలు)కి రూ.1,294 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.1,259 కోట్లు రుణాలుగా ఇచ్చి 97 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పారు. మిగిలిన రుణాలు గడువులోగా పంపిణీ చేయాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. కొత్తవారికి రుణాలు అందించి ప్రోత్సహించాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉపాధి కల్పన ద్వారా జిల్లాలో 2,700 మందికి రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రూ.10 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 30,900 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయన్నారు. వాటికి కోటా తగినన్ని రుణాలు అందిసున్నట్లు చెప్పారు. సమావేశంలో పలు మండలాల బ్యాంక్ అధికారులు, ఎపిఎంలు పాల్గొన్నారు.

'మాండూస్' బాధితులందరికీ పరిహారం

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో మాండూస్ తుపాను ప్రభావానికి గురైన రైతులందరికీ నష్టపరిహారం అందజేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల జిల్లాలో పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారం అందించాలని వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులకు సూచించారు. రైతులు ఎంతో కష్టపడి పంటలు సాగు చేసుకోవడం జరిగిందని పంట నష్టాన్ని మానవతా దృక్పథంతో ఆలోచించి రైతులను అన్ని రకాలుగా ఆదుకోవాలని ఆయన సూచించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ జిల్లాలో పంట నష్టం జరిగిన ప్రతి రైతు పొలం దగ్గరికి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు వెళ్లి పక్కాగా, పగడ్బందీగా పంట నష్టపరిహారం వివరాలు సేకరించాలన్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టపరిహారం సేకరణ వివరాలను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 24వ తేదీ లోపల ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పంట నష్టం జరిగిన ప్రతి రైతు వివరాలు పంట నష్టపరిహారం నివేదికలో పొందుపరచాలన్నారు. రైతుల నుంచి సేకరించిన నష్టపరిహారం వివరాలను ఈ నెల 25వ తేదీ నుంచి 29 వరకు సామాజిక తనిఖీ కొరకు రైతు భరోసా కేంద్రాలలో జాబితా ప్రదర్శించాలన్నారు. ఈ నెల 30వ తేదీ పంటనష్ట పరిహారం జాబితా ప్రభుత్వానికి సర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంద శాతం ప్రగతి సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లలో వంద శాతం ప్రగతి సాధించాలని, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జల్ జీవన్ మిషన్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల కింద జరుగుతున్న పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందఠరేగా ఆయన మాట్లాడుతూ పనుల పురోగతిలో లక్ష్యాలను త్వరగా చేరుకోవలన్నారు. జల్‌జీవన్ మిషన్‌కు సంబంధించి మదనపల్లె డివిజన్‌లో 1075 పనులు పూర్తయ్యాయని, 472 పనులు పురోగతిలో ఉన్నాయని మదనపల్లె డివిజన్ అధికారులు కలెక్టర్‌కు తెలియజేసారు. 915 పనులు పూర్తయ్యాయని, 718 పనులు పురోగతిలో ఉన్నాయని రాయచోటి డివిజన్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లకు సంబంధించి జిల్లాకు 412 సీఎస్‌సీలు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి సంబంధించి కేవలం 58 శాతం పనులు ఎందుకు పూర్తయ్యాయని అధికారులను ప్రశ్నించారు. పనుల పురోగతిపై వారానికోసారి సమీక్ష నిర్వహిస్తామని అధికారులకు తెలియజేశారు.పనిచేస్తున్న గృహ కుళాయి కనెక్షన్‌లకు సంబంధించి (ఎఫ్‌హెచ్‌టిసి) 15-12-2022 నాటికి 89 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు తెలియజేసారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సమీక్షా సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న టూరిజం శాఖ జిల్లా అధికారి

పర్యాటక అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ సహకారంతో పీలేరు పట్టణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎపి టూరిజం శాఖ అన్నమయ్య జిల్లా అధికారి ఎం.నాగభూషణం తెలిపారు. శుక్రవారం ఆయన ఎపి టూరిజం కౌన్సిల్ మెంబర్ షేక్ షాకీం పట్టణంలోని రహదారుల ప్రక్కన టూరిజం భవనాలు, సదపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయడానికి స్థానిక తిరుపతి రోడ్డులోని వివిధ ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారని పేర్కొన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో పర్యాటక కేంద్రంగా పీలేరును అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, సర్వేయర్ రామాంజులు, యోగా, రెవెన్యూ సిబ్బందితో పాటు యువ నాయకులు ఇంతియాజ్, ఉబోదుల్లా, నాగార్జున పాల్గొన్నారు.

వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పీలేరు

క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉచిత ఆధునాతన కంటి చూపు పరీక్షలు, వైద్య సేవలు అందుబాటులోకి రావడం మంచి పరిణామమని వేపులబైలు ఉప సర్పంచ్ విపి పవన్ కుమార్‌రెడ్డి, వైసిపి యువ నాయకులు విపి రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వేపులబైలులో భాస్కర నేత్రాలయ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందఠరేగా వారు మాట్లాడుతూ ప్రజలు వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ సురేష్, ఆప్టోమెట్రిస్ట్ షౌకత్ అలీ బాష స్థానిక ప్రజలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి, కంటిచూపు సమస్యల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాల గురించి వారికి తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎల్.జ్ఞాన శేఖర్, డిడిఒఎస్. ఫరూక్, సచివాలయ ఉద్యోగులు, భాస్కర నేత్రాలయ వైద్య సిబ్బంది కె. మాధురి, సోని, సచివాలయ ఉద్యోగులు బి.శివ శంకర్, బి.రాజశేఖర్, దుర్గాప్రసాద్‌రెడ్డి, జి.సుబ్రహ్మణ్యంరెడ్డి, జి.సింధురెడ్డి, బి.మాధురి, ఏఎన్ఎం అనసూయమ్మ, ఆశ వర్కర్ శ్రీలతమ్మ, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు ఉద్యమించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విభజన హామీలు, ప్రత్యేక హోదా సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని రాయచోటి ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకుడు వల్లి అన్నారు. శుక్రవారం రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యు) జిల్లా మొదటి మహాసభ స్థానిక ఎపి ఎన్‌జిఒ హోంలో జయసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లి మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలు పరిష్కారం కోసం ఆర్ఎస్‌యు నాయకులు కృషి చేస్తున్నందుకు అభినందిస్తున్నానని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రాన్ని మోసం చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తిగా విఫలమైందన్నారు. ఆర్ఎస్‌యు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. మహాసభలో జిల్లా వ్యాప్తంగా ఉన్న నాయుకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కొత్తవారిపల్లి పంచాయతీ రెడ్డివారిపల్లె మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ హెచ్ఎం జి.వి.ప్రసాద్, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం లక్ష్మీపతి అధ్యక్షతన విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పిఎన్ ఇందిరమ్మ జ్ఞాపకార్థం రిటైర్డ్ హెచ్ఎం జి.వి.ప్రసాద్ రూ.10 వేలు విలువచేసే విద్యా సామగ్రిని 70 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సంస్కారం, క్రమశిక్షణ అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత ఆశయాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి, అపర్ణ ప్రసాద్, మాధవిలత, మాధవ, మోహన్, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ప్రసాద్

బస్టాండు కేంద్రంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

బస్సులు ఆపాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలకేంద్రం నుండి మదనపల్లి, వాయల్పాడులోని కళాశాల, పాఠశాల సమయానికి అనుకూలంగా బస్సులను నడపాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు శుక్రవారం స్థానిక బస్టాండ్ కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ గుర్రంకొండ తదితర గ్రామాల నుంచి చదువులు అభ్యసించడానికి మదనపల్లి వాయల్పాడు పట్టణంలోనికి వివిధ కళాశాలలకు వందలమంది విద్యార్థులు వస్తున్నారు. నాలుగు నెలల నుంచి బడి బస్సు, ఇతర బస్సులు సక్రమంగా రాక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థులంతా ఆర్టీసీ డిపోకు బస్సు పాస్ చెల్లించి బస్సు రాకపోవడంతో విద్యార్థులు, విద్యార్థులతల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులకు ఈ సమస్యను తెలియజేసినా అధికారులు స్పందించక పోవడంతో ఆందోళన చేపట్టామని తెలిపారు. ఆందోళన నిర్వహించిన విద్యార్థులపైన, విద్యార్థిసంఘాలపై కేసులు పెడతామని బెదిరించడం సరి కాదని అన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల సమస్య లేకుండా సమయానికి బడి బస్సు నడపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్టీసీ డిఎం కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులతో ముట్టడిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రెడ్డిరాజు, హేతారాం, కార్తీక్, నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతోనే విజ్ఞానం

ప్రజాశక్తి - కడప

క్షేత్ర పర్యటన ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా విజ్ఞానాన్ని పెంపొందించవచ్చునని ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. రవి శేఖర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ పురుషుల కళాశాల లోని జంతుశాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటనలో భాగంగా యోగి వేమన యూనివర్సిటీని సందర్శించారు. విశ్వవిద్యాలయంలోని సీతాకోక చిలుకల సందర్శనశాల విద్యార్థులను ఎంతగానో ఆకర్షించింది. సందర్శనశాలలో భద్రపరచినటువంటి వివిధ రకాల కీటకాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. వివిధ రకాల పరికరాలను, వాటి పని విధానం గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ ఆచార్యులు, ఎ. టి. వెంకట రమణ రెడ్డి, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ లోకేష్, డాక్టర్ మరియాదాస్,మనస్విత, అధ్యాపకులు డాక్టర్ వై. సావిత్రి, డాక్టర్ నరసింహా రావు, నాగేంద్ర కుమార్, శ్రీనిత మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు వేలం

ప్రజాశక్తి -నిమ్మనపల్లి

నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ఫాతిమా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వివిధ కేసులలో పట్టుబడిన ఒక్క ద్విచక్ర వాహనం ఎపి39ఏఏ 8101(ప్యాషన్ ప్లస్) ను స్థానిక పోలీస్ స్టేషన్ నందు 17వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు మదనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన పాటదారులు ఉదయం 9.30 గంటలకు హాజరై ముందుగా 2 వేల రూపాయల ప్రవేశ రుసుమును చెల్లించి పాల్గొనాలని అన్నారు. వేలం పాటలో ద్విచక్ర వాహనాన్ని దక్కించుకున్న వారికి జిఎస్టి అదనంగా ఉంటుందన్నారు.

కొండయ్యగారిపల్లెలో ఇదేంఖర్మ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు

సుపరిపాలన టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్రంలోని ప్రజల కష్టాలు తీరి సుపరిపాలన రావాలంటే తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మదనపల్లి, పీలేరు నియోజక వర్గాల పరిశీలకులు బొమ్మనచెరువు శ్రీధర్, రాష్ట్రకార్యదర్శి ఉపాధ్యక్షులు తులసీధర్ నాయుడు తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షుల ఆదేశాల మేరకు శుక్రవారం కొండయ్యగారిపల్లెలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మాజీ జెడ్పిటిసి సభ్యులు వసంతా మునిరత్నం, టిడిపి మండల అధ్యక్షులు పుర్రావెంకటరమణ, టిడిపితెలుగుయువత అధ్యక్షులు చిన్నబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అన్నీ కష్టాలే మిగులుతున్నాయని అన్నారు. పల్లెల్లో ఎక్కడచూసినా పారిశుధ్యం సమస్యలు, మురికికాలువలు, సిమెంటురోడ్లు ఏర్పాటు చేయకపోవడం వంటివి ప్రధానంగా వినిపిస్తున్నాయని అన్నారు. ఇసుక దోపిడీని అరికట్టడానికి అధికారులు ఏమాత్రం సహకరించడం లేదని తెలిపారు. నిత్యవసర ధరలు, విద్యుత్‌చార్జీలు, ఆర్‌టిసి బస్సుచార్జీలు భారాలను ప్రజలపై మోపి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో టిడిపి చేపడుతున్న కార్యక్ర మాలకు ప్రజల ఆదరణ విశేషంగా పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రావు, శ్రీనివాసులు, మల్లికార్జున, మురళి, మల్లప్ప, విజయ్, చంద్ర, గోపి, చంద్రాయుడు, ఆనంద పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** నియోజకవర్గం టిడిపి ఇంచార్జి ,మాజీ శాసన సభ్యులుశంకర్ యాదవ్ ఆదేశాల మేరకుపెద్దమండ్యం మండలం వెల్లిగల్లు పంచాయతీలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మండలకన్వీనర్ జి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్‌ఇంచార్జి జి.వెంకటరమణ, యూనిట్ ఇంఛార్జి ఎల్ఐసి శ్రీన, గ్రామఅధ్యక్షులు రామంజులు, మండల ప్రధాన కార్యదర్శి కలేషా, బిసిసెల్ రాజంపేట పార్లమెంట్ మీడియా కోఆర్డినేట్ అంజి, మండల ప్రచార కార్యదర్శి సాంబ, సుబ్బి రామి రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మహేశ్వర రెడ్డి, సయ్యద్ భాష, చంద్ర, రామంజులు, నాగముల్ రెడ్డి, రఫీ, మోహన్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. **చిట్వేలి:** మండల పరిధిలోని నేతివారిపల్లి, నగిరిపాడు పంచాయతీలో టిడిపి ఇంచార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అధ్యక్షతన ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలనపై ప్రజలు విసిగి పోయారని అన్నారు. నిత్యావసర సరుకులు, పెట్రోలు, విద్యుత్ , ఆర్‌టిసి చార్జీల పెంపుతో పేద,మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మరల ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.కె.చౌదరి, మహిళా నాయకులు అనిత దీప్తి, ఏదోటి రాజ శేఖర్, బాలకృష్ణ యాదవ్, గుండాలయ్య యాదవ్, రాయిని ఆది లక్ష్మమ్మ, పెరుగు కృష్ణయ్య, శివకుమార్ రాజు, నాగయ్య యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం గడికోట పంచాయతీ ఎర్రపాపి రెడ్డి గారి పల్లి కు చెందిన వర్ల పిచ్చయ్య కుమారుడు వెంకటరమణ చెందిన పాస్ పోర్ట్ రాయచోటి నుండి బస్సులో తన సొంత ఊరైన ఎర్ర పాపి రెడ్డి గారి పల్లెకు వస్తున్న సమయంలో 10/12/ 2022న పాస్ పోర్ట్, టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్,పోయినవి. పాస్ పోర్ట్ నెంబర్.M534997. టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ నెంబర్.091096. రోల్ నెంబర్.0959194. ఇప్పటివరకు వెతికిన కనిపించలేదు. ఎవరికైనా దొరికిన ఎడల తమకు సమాచారం అందించగలర ని మనవి.

వర్ల వెంకటరమణ S/o పిచ్చయ్య.
ఫోన్ నెంబర్ : 8500362258.

ఎందుకంత చిన్నచూపు..!

ప్రజాశక్తి - బి.కొత్తకోట

తమ గ్రామంపై అధికారులకు ఎందుకంత చిన్నచూపు అని మండల పరిధిలోని బద్దిపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు తిష్ట వేసినప్పటికీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. గ్రామంలో 60 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వారి సమస్యలను పట్టించుకోకపోవడం శోచనీయమని, కనీసం తాగునీటి సమస్యలను కూడా పరిష్కరించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 3న ' మరమత్తులకు నోచుకోని తాగునీటి బోరు ఆరేళ్లుగా ట్యాంకర్లే ఆధారమనే' శీర్షికతో ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం విధితమే. దీనిపై స్పందించిన కమిషనర్ నరసింహప్రసాద్ బోరు మోటర్ మరమ్మతు చేసి నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అధికా రులు తూతూ మంత్రంగా బద్దిపల్లికి వెళ్లి బోరు మోటర్ తీసుకుని వచ్చి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేయడంతో గ్రామస్తులు తీవ్ర నిరాశ గుర య్యారు. తమ గ్రామం నగర పంచాయతీ పరిధిలోకి వచ్చినప్పటికీ సమ స్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని వాపో యారు. నగర పంచాయతీ కమిషనర్ చొరవ తీసుకొని గ్రామానికి నీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కమిషనర్ ఆదేశించినా మరమ్మతులకు నోచుకోని తాగునీటిబోరు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి -రైల్వేకోడూరు

మండలంలోని ఉర్లగడ్డ పోడు గ్రామ పంచాయితీలోవాసన్ ఎన్‌జిఒ సంస్థ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ యు.సుధాకర్, డివిజనల్ ఇంచార్జ్ డి. కృష్ణార్జున్ ఆధ్వర్యంలో చిరుదన్యాలు, నాటుకోళ్ల పెంపకంపై హెల్త్ అండ్ న్యూట్రిషన్ సిబ్బంది, మహిళ రైతులకు, రైతులకు ఆర్‌వైఎస్ఎస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా రైతు వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ పంజం సుకుమార్ రెడ్డి, సర్పంచ్ కోటకొండ్ల గోపి హాజరయ్యారు. కార్యక్రమములో రైతులకు అర్ధఎకరా పొలంలో 36 మోడల్స్, 5 లేయర్ మోడల్స్, రెండు ఆవులు, 50 కోళ్ళ, 5పొట్టేలు, ఆకుకూరలు, కూరగాయలను పండించే ప్రకృతి వ్యవసాయ మోడల్స్ గురించి, ఆరోగ్యంగా ఉండటానికి చిరుధాన్యాల, పౌష్టిక ఆహారం తీసుకోవటంలో భాగంగా ప్రాక్టీకల్ గా రాగి పాయసంని తయారు చేసి చూపించారు. మహిళలందరూ కుటుంబంలో ఆకుకూరలు, కూరగాయలను, చిరుధాన్యలను పండించుకొని పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి ఉష, మాస్టర్‌ట్రైనర్ సిద్దయ్య హెచ్‌ఎన్‌ఎంటి సుజాత ఎపిసిఎన్ఎఫ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని లక్కిరెడ్డిపల్లి ఉద్యానవన శాఖ అధికారి నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుడి, కొనంపేట గ్రామాలలో తోటబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు మామిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడిలో పూత, పిందే సమయంలో చేపట్ట వలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆడ పూత శాతం పెరగడానికి 13-0-45, 10 గ్రా. లీటర్ నీటికి సాల్యు బోరాన్ 2 గ్రా. లీటర్ నీటికి, జింక్‌సల్ఫేట్ 2గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. మామిడిలో పూమొగ్గ దశలో తేన మంచు పురుగు, మసి తెగులు, పక్షికన్నుతెగులు, బూడిదతెగులు వచ్చే అవకాశం ఉందని వీటి నివారణకు సైహాలోత్రిన్ ఒక లీటర్ నీటికి, నీటిలో కరిగే సల్ఫర్ 2 గ్రా. లీటర్ నీటికి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమానికి రైతు సంఘం నాయకుడు శంకర్ రెడ్డి, రైతు భరోసా కేంద్రసహాయకులు పవన్, అనూష, కేరోలిన్, రైతులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ధ్రువ జీవామృతంతో ఏ పంటకైనా చీడపీడలు నివారించ వచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కాంతమ్మ పేర్కొన్నారు. శుక్రవారం దప్పేపల్లి పంచాయతీలోని కొండవాళ్లపల్లెలో సోమశేఖర్ రెడ్డి రైతు తన పంట పొలాలకు 10 డ్రమ్ములు ధ్రువ జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా కాంతమ్మ మాట్లాడుతూ 2000 లీటర్ల ధ్రువ జీవామృతం చేసుకుంటే ఏపంట సాగుచేసిన ఈ జీవామృతాన్ని పిచికారి చేసుకో వచ్చన్నారు. 20 కేజీలు బెల్లం 20 కేజీలు సెనగపిండి, 200 లీటర్లు దేశీ ఆవు మూత్రం, పుట్ట మట్టి 100 కేజీలు పేడతో ఈ జీవామృతాన్ని తయారు చేసుకోవచ్చు అని రైతులకు సూచించారు. ప్రకృతి ఎరువులు పంటకు ఎంతోబలంగా ఉంటుందని, రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి ఎరువులు వాడితే భూమి సారవంతంగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో యం.ఎ.సరస్వతి యూనిట్ ఇంచార్జి గంగిరెడ్డి, షాహిర్‌భాష , ఐసిఆర్‌పిలు శివకుమార్, మహేంద్ర ,షాబీర్, అంజనమ్మ, ప్రసన్న, లక్ష్మీ పాల్గొన్నారు

కరాటే పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్రస్థాయి స్కై కరాటే పోటీలకు, రెడ్డివారిపల్లె ఆదర్శ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎన్.గోవర్ధని ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కేఎస్ఎన్ మూర్తి, ఫిజికల్ డైరెక్టర్ మణికుమార్ తెలిపారు. అండర్-14కేటగిరీలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ చూపిం దన్నారు. శనివారం నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి స్కై కరాటే పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ప్రిన్సిపల్ మూర్తి, పీడీ మణికుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గ్రామ సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసువారిపల్లి గ్రామసచివాలయాన్ని శుక్రవారం ఎంపిడిఒ ఆనంద్ కుమార్ తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చ రించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సైన్సు ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంతో విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందని సర్పంచ్ నీలుఫర్ తెలిపారు. శుక్రవారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ రూపొం దించిన ప్రయోగాత్మక ప్రయోగాలను ఎగ్జిమిషన్లో డెమో నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** స్థానిక చదివే వాండ్ల పల్లి ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంఇఒ రంగనాథ్‌రెడ్డిచే సైన్స్‌ఫేర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహిం చినట్లు ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు సంపత్ కుమార్, ఉపాధ్యాయుడు ప్రకాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఊరేగింపు శోచనీయం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

తెలుగుదేశం పార్టీ దళిత నాయకులు శుక్రవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు టిడిపి దళిత నాయకులకు మద్దతుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి రాయచోటి ఉపాధ్యక్షుడు పుల్లేల రమేష్ మాట్లాడుతూ గతంలో ఈస్ట్ గోదావరి ఎమ్మెల్సీ అనంత బాబు తన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేయించడం తెలిసినదేనని తెలిపారు. హత్య చేసినందుకు హైకోర్టు శిక్ష విధించిందని తెలిపారు. అనంతబాబు సుప్రీంకోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నారు. ఒక దళితుడైన సుబ్రహ్మణ్యం చంపినందుకు బాధప డవలసినది పోనిచ్చి అదేదో గొప్పగా బెయిల్ తీసుకున్న తర్వాత ఊరేగిం పుగా వెళ్లడం శోచనీయమన్నారు. దళితులు, మైనార్టీలు వలన అధికారంలోకి వచ్చినటు వంటి జగన్మోహన్ రెడ్డి దళితులకు జరుగు తున్న అన్యాయం విషయంలో కొంతైనా చింత లేనట్టుగా ప్రవర్తించడం బాధాకమన్నారు. కార్యక్రమంలో టిడిపి దళిత నాయకులు ఎర్రతోట సురేష్, అనిత దీప్తి, జైచంద్ర బాబు, గంగాధర్ మండల ఎస్‌సి టిడిపి అధ్యక్షులు శ్రీరాములు పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిద్దాం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

వచ్చే ఏడాది జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిద్దామని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒలు, బిఎల్ఒ సూపర్వైజర్లతో తహశీల్దార్ ధనుంజయులు, డిప్యూటీ తహశీల్దార్ హరి, ఆర్.ఐ బాలాజీ, నగర పంచాయతీ ఆర్.ఐ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్‌లు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయిందని, పోలింగ్ కేంద్రాలు కేటాయింపు, అందులో కల్పించాల్సిన సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు చేసుకున్న వారికి స్లిప్పులు అందజేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికలప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉమ్మడి వనరుల వారోత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో ప్రతి ఏడాది ఎఫ్ఇఎస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది డిసెంబర్ నెలలో ఉమ్మడి వనరుల వారోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తంబళ్లపల్లి కస్తూరి బాలికల గురుకుల పాఠశాల మోడల్ స్కూల్ కన్నె మడుగు ఉన్నత పాఠశాలలో ఉమ్మడి వనరుల వారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు ఉమ్మడి వనరులు పర్యవేక్షణ అనే అంశంపై వ్యాసరచన చిత్రలేఖనం పోటీలో నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన ప్రతి పాఠశాల నుండి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాలల్లో పండ్ల మొక్కలను అందజేసి వాటిని నాటారు. కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, కన్నెమడుగు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఎఫ్ఇఎస్ విజయ్ శేఖర్, పారేశమ్మ, మమత, రేష్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లె, దళవాయిపల్లె , వత్తలూరు,టి. కమ్మపల్లె తదితర గ్రామాలలో 33 కెవి,11 కెవి లైన్‌లకు మరమ్మతులు కారణంగా శని వారం నాడు విద్యుత్ సరఫరా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేయ బడుతుందని ఎఇ కుమార్ ఒక ప్రక టనలో తెలపారు. వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు. **బి.కొత్తకోట :** బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ ప్రభావం కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు మరమ్మతుల్లో భాగంగా నేడు అనగా శనివారం బి.కొత్తకోట మండలంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ గిరిధర్ వెల్లడించారు.

సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

ప్రజాశక్తి- కలికిరి

సచివాలయ సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని వైసిపి మైనార్టీ నాయకుడు మదార్ సాహెబ్ పరిశీలకొడుగా మండలానికి వచ్చిన నాగార్జున రెడ్డికి ఫిర్యాదు చేశాడు. కలికిరి మండలంలో మూడు రోజుల పర్యటన నిమిత్తం ప్రజా సమస్యలను పరిష్కారమే ధ్యేయంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం కలికిరి నాలుగవ సచివాలయం గుట్టపాలెం గ్రామంలోని సచివాలయంలో అధికా రులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టపాలెం సచివాలయంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సందర్భంగా ఆయనకు గుట్టపాళ్యం గ్రామస్తులు ఆయనకు సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని సచివాలయం కు వస్తే సర్పంచ్ లెటర్ లేనిదే చేయమని వారికి చెప్పుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని దీంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆయనకు తెలియజేశారు. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ఇకమీదట అలాంటి సమ స్యలు తలెత్తకుండా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం వారికి నిర్దేశించిన సేవలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సమస్యలు కోరి వచ్చిన వారితో గౌరవప్రదంగా వ్యవహరించాలని తెలిపారు. చాలామందికి ఇప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గూర్చి తెలియడం లేదని, వీటిపై వాలంటీర్లు, సచి వాలయ సిబ్బంది, సంక్షేమ పథకాలు పొందు తున్న ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డిపిఒ ధనలక్ష్మి, డిఎల్‌డిఒ లక్ష్మీపతి, డిఎల్‌పిఒ విజయకుమారి, కలికిరి సచివాలయం 4నందు సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఇఒ ఉదయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పత్రికా ప్రకటన

అన్నమయ్య ప్రాజెక్ట్ శాశ్వత పునరుద్ధరణ కొరకు ప్రభుత్వము పరిపాలన పరమైన అనుమతులు G.O.R.T. సంఖ్య 2076, జలవనరుల శాఖ ద్వారా తేది: 02.11.2022, రూ.787.77 కోట్ల రూపాయలతో ఉత్తర్వులు మంజూరు చేయడమైనది.

పై పనిని యల్.యస్ సిస్టం టెండర్ మరియు రివర్స్ టెండర్ పద్ధతి ద్వారా పనులు చేయుటకు ప్రతిపాదనలను రూ.787.77 కోట్ల రూపాయలకు జ్యుడిషియల్ ప్రివ్యూకు జలవనరుల శాఖ సమర్పించడము జరిగినది. పై పనులు పూర్తి చేయుటకు 24 నెలలు కాల పరిమితి ప్రతిపాదించడం జరిగినది.

జ్యుడిషియల్ ప్రివ్యూ ఆమోదము లభించిన వెంటనే టెండర్ నోటీసు జారీ చేయబడును. ఈ నమున టెండర్ డాక్యుమెంట్‌ను ఇంజనీర్-ఇన్ - చీఫ్ వారి వెబ్ సైట్ లోను, జ్యుడిషియరీ వెబ్‌సైట్ లోను 13.12.2022 నుండి 21.12.2022 వరకు పెట్టడం జరిగినది. కావున ప్రజలు తమ సూచనలు/ సలహాలు/ అభ్యంతరములను Judge-ipp@ap.gov.in., apjudicialpreview@ gmail.com & se_kadapa@yahoo.co.in. ఆయా వెబ్ సైట్లలో 21.12.2022 5.00pm లోగా నమోదు చేయగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

జిల్లా జలవనరుల అధికారి,
రాయచోటి, అన్నమయ్య జిల్లా.

మహాసభలకు తరలిరండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈ నెల 22,23 న రాయచోటి లో జరిగే సిఐటియు జిల్లామహాసభలకు తరలివచ్చి జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి. భాగ్యలక్ష్మి, సిఐటియు నాయకులు ఫయాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బాలసదనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను ప్రైవేటీకరణ చేసే క్రమంలో ప్రతి సంవత్సరం నిధులు తగ్గిస్తూ,అధిక పనిభారం చేయిస్తున్నారని అన్నారు. మాతా శిశుమరణాల రేటు తగ్గింపు ప్రక్రియ కాకుండా సంబంధం లేని పనులు చెబుతూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ధరలకనుగుణంగా కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని పర్మినెంట్ చేయాలని, సకాలంలో జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యాల కోసం జరిగే జిల్లామహాసభలకు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మహాసభ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభావతి, ప్రధాన కార్యదర్శి ఓబులమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు. **గుర్రంకొండ**: సిఐటియు జిల్లా ప్రథమ మహాసభలు ఈనెల 22,23 తేదీల్లో రాయచోటిలో జరుగుతాయని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.హరిశర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం గుర్రంకొండ మండల సిఐటియు మహాసభలు స్థానిక స్త్రీ శక్తి భవనం లో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సిఐటియు దేశంలో 1970లో ఐక్యత, పోరాటం నినాదంతో ఏర్పడి, ఉద్యోగులు, కార్మికులు సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తూ, దేశంలో అతి పెద్ద కార్మిక సంఘంగా నిలిచిందని అన్నారు.న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యపోరాటాలపై సభలలో చర్చిస్తామని అన్నారు. **సిఐటియు మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక** : సిఐటియు మండల అధ్యక్షులు గా ఆర్. సుభాషిని, ప్రధాన కార్యదర్శి గా టి.పద్మశ్రీ, ఉపాధ్యక్షులుగా డి. మాధవి, సహాయ కార్యదర్శి గా ఎన్.రమాదేవి మరో 11మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.కార్యక్రమంలో మెహరాజున్నిషా, లక్ష్మినరసమ్మ, లలితమ్మ, శిరీష పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జాతీయ రహదారిపై లారీ బోల్తా

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధి లోని అనంతంపల్లె కడప-చెన్నై హైవేపై శుక్రవా రం తెల్ల వారుజామున 5గంటలకు చెన్నై ఓడరేవు నుంచి ముంబై వెళ్తున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల లారీ బోల్తా పడింది. ప్రమా దవ శాత్తు ఆసమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కాసేపు ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. స్వల్ప గాయాలతో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. మలుపుల వద్ద అధిక వేగంతో వస్తున్న వాహనదారులకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే మలుపుల వద్ద ఇలాంటి ప్రమాదాలు జరగవని, అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలని గ్రామస్తులు కోరారు.

ఘటనా స్థలంలో విచారణ చేపడుతున్న సిఐ నరసింహారావు

విభిన్నప్రతిభావంతుడి సజీవ దహనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విభిన్నప్రతిభావంతుడిని గుర్తుతెలియని ఆగంతకులు పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన సంఘటన అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణంలో కలకలం రేపింది. పట్టణ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో అటవీ శాఖ కార్యాలయానికి సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకోగా పట్టణ సిఐ నరసింహారావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించి పట్టణ సిఐ నరసింహారావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు మైదుకూరుకు చెందిన అంకాల్‌రెడ్డి(55) 15 ఏళ్ల క్రితం మైదుకూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తన కాలును పోగొట్టుకోవడంతోపాటు భార్య ప్రభావతిని కూడా కోల్పోయాడు. ఊరూరు తిరుగుతూ యాచక వృత్తి చేసుకునేవాడు. ఈ సజీవ దహనానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఎవరు చేశారో, ఎందుకు చేశారో అనే కోణంలో సిసి టివి పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ద్విచక్ర వాహన ప్రమాదంలో రైతు మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ద్విచక్ర వాహన ప్రమాదంలో రైతు మృతి చెందిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండల పరిధిలోని రాచవేటివారిపల్లె పంచాయతీ గుడ్లవారిపల్లికు చెందిన వెంకటరమణ కుమారుడు ఎస్.రామాంజులు (48) గురువారం రాత్రి వ్యక్తిగత పనుల పై ద్విచక్ర వాహనంలో చౌడేపల్లికు వెళ్లి తిరిగి వస్తూ ఆచార్లపల్లె సమీపంలో సాగుచేసిన టమోటా పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తూ ఆచార్లపల్లె-పుంగనూరు రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న నీటి గుంతలో పడి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఫాతిమా సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య కొండమ్మ ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల సాగుచేసిన టమాటా పొలంలో భారీగా నష్టాలు రావడం, కుటుంబ యజమాని ఆకస్మికంగా మరణించడంతో, మృతుని కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- వీరబల్లి

మండలంలోని వంగిమళ్ల గ్రామం నాగిరెడ్డిగారిపల్లెకు చెందిన శివారెడ్డి అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ట్రాలీ గత రెండురోజుల క్రితం చోరి అయ్యింది. బాధితుడు శివా రెడ్డి వీరబల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ట్రాలీని చోరి చేసిన నిందితుల ఆచూకీ కోసం రాయచోటి రూరల్ సిఐ లింగప్ప ఆధ్వర్యంలో వీరబల్లి ఎస్ఐ రహీముల్లా, సిబ్బంది కలిసి ముమ్మరంగా గాలించి ఎట్టకేలకు రామాపురం మండలం రాచపల్లె పంచాయితీలోని గంగనేరుకు చెందిన నరేష్ అనే వ్యక్తిగా గుర్తించారు. నిందితుడి కోసం గాలిస్తుండగా శుక్రవారం ఓదివీడు బస్టాప్ వద్ద నరేష్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుండి ట్రాలీని స్వాధీనం చేసుకున్నట్లు వీరబల్లి ఎస్ఐ రహీముల్లా తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుళ్లు రాజు, హారూన్, కానిస్టేబుళ్లు ఖాదర్ వలీ, షౌకత్ అలీ, అరీఫుల్లా పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచర్

ప్రజాశక్తి - బి కొత్తకోట

గతంలో ఓమహిళ మెడలో తాళిబొట్టు,గిన్నెబొట్టులను అపహరించుకుని వెళ్ళిన నిందితుడిని శుక్రవారం బి.కొత్తకోట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్.ఐ.రామ్మోహన్ కథనం మేరకు వివరాలు. ఈ ఏడాది మే13వ తేదీన మండలంలోని శెట్టిపల్లెకు చెందిన శాంత కుమారి అనే మహిళ కాలకృత్యాలకని గ్రామ సమీపంలోకి వెళ్లగా బి.కొత్తకోట పట్టణంలో బిసి కాలనీకి చెందిన చంద్ర కుమారుడు లక్ష్మీనారాయణ (25) కాపు కాసి కత్తితో బెదిరించి తాళిబొట్టు అపహరించుకొని వెళ్లాడన్నారు. మహిళ తాళిబొట్టు, గిన్నెబొట్టు కలిపి ఐదు గ్రాములు ఉంటాయని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిందన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ దుకాణంలో వీటిని విక్రయించడానికి నిందితుడు ప్రయత్నించగా అనుమానం వచ్చి అదుపులో తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడన్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుడు ఇటీవల కాలంలో బెంగళూరులో మొబైల్ ఫోన్లో చోరీ పాల్పడే వాడని,నగరంలోని సదాశివ నగర్ పోలీసులు సైతం అతన్ని పలు కేసులు అరెస్టు చేసి సబ్ జైల్లో ఉంచారన్నారు. బెయిల్ పై విడుదలైన లక్ష్మీనారాయణ వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడేవాడనివెల్లడించారు. దాడిలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రవీందర్ నాయక్, నాగరాజ్‌గౌడ్, కానిస్టేబుల్ శేఖర,లక్ష్మీనారాయణ, వెంకట రమణ, పాల్గొన్నారు.